క్లుప్తంగా

గౌరవ వందనం స్వీకరించిన భట్టి



మధిర: మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి మల్లు భట్టి విక్రమార్క పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డిప్యూటీ సీఎం పదవితోపాటు క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మధిర ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి మొట్టమొదటిసారిగా వచ్చిన సందర్భంగా పోలీసులు ప్రోటోకాల్‌లో భాగంగా గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో మధిర సీఐ జాటోత్ వసంత్ కుమార్, టౌన్ ఎస్‌ఐ రాజేష్, రూరల్ ఎస్‌ఐ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైరా ఎమ్మెల్యేను కలిసిన సీఐ



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ తిరుపతిరెడ్డి

కారేపల్లి: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి ఎస్సై రామారావులు సోమవారం ఖమ్మంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మండలంలోని పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అజ్మీర రమేష్, బానోత్ దేవ్లానాయక్, ఇమ్మడి తిరుపతిరావు, గుగులోత్ శ్రీను, మల్లెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మధ్యే ఉంటా..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

కారేపల్లి: ఓడినా.. గెలిచినా ప్రజల మధ్యనే ఉంటానని, ప్రజలతోనే తిరుగుతానని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అన్నారు. సోమవారం కారేపల్లి వైఎస్‌ఎస్ గార్డెన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినంత మాత్రన అధైర్యపడొద్దని ధైర్యంగా ఉండాలని ప్రజా సమస్యలపై పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగన్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ వీరేందర్, రమేష్, బన్సీలాల్, జ్యోతి, నాగేశ్వరరావు, శాంతి, సతీష్, రాంజీ, సక్రు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో వైరా మండలం సిరిపురానికి చెందిన బీటెక్ విద్యార్థి ముత్తయ్యకు సోమవారం ల్యాప్‌టాప్ వితరణ చేశారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ లయన్ ఘట్టమనేని బాబూరావు మాట్లాడుతూ.. విద్యాట్రస్టు ద్వారా నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించడం అభినందనీయం అన్నారు. గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్‌వీ శివప్రసాద్, పాస్ట్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, మల్టీపుల్ చైర్మన్ తీగల మోహనరావు, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, ఆర్‌సీ లడగపాటి ప్రభాకర్‌రావు, కొమ్మినేని భారతి, డాక్టర్ శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్, రామకృష్ణ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయండి



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధు, రంగారావు

ఎర్రుపాలెం: రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేస్తూ పాత పింఛన్ విధానం అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొత్కూరు మధు, ఆర్ రంగారావులు డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పీఆర్టీయూ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, అమృతకుమార్, నరసింహారావు, బాలకృష్ణ, గురునాధరెడ్డి, శ్రీను, నాగరాజు, లింగయ్య తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా.. మూలమలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



లక్ష్మీపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

కొణిజర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. అనేక మంది ఈ మార్గాల్లో ప్రయాణిస్తూ.. ప్రమాదాల భారీన పడిన సంఘటనలో చాలనే ఉన్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు..

ఇంత జరుగుతున్నా సదరు శాఖల అధికార్లు ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మండలంలోని చిన్నగోపతి, తుమ్మలపల్లి, లక్ష్మీపురం, గద్దలగూడెం, ఉప్పలచలక, సింగరాయపాలెం వెళ్లే రహదారుల్లో అనేక చోట్ల మూలమలుపులు యూ ఆకారంలో ఉన్నాయి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా గుబురుగా చెట్లు పెరగడంతో మూల మలుపులు దగ్గరకు వచ్చే వరకు కనిపించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుందని ప్రయాణీకులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాయాలపాలవుతున్న వాహనదారులు..

గతంలో అనేక మార్లు లక్ష్మీపురం వద్ద ఉన్న మూల మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగి తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితం అయిన వారు ఉన్నారు. చిన్నగోపతి ఊరి మధ్యలోనే రెండు మూలమలుపులు ఉండటంతో ఇళ్లల్లో నుంచి అకస్మాత్తుగా ఎవరు వస్తారో నని వాహనదారులు.. ఎటునుంచి ఏ వాహనం వస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామంలో కొత్తగా తారు రోడ్డు నిర్మిస్తున్న సందర్భంగా స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని అడిగినా అధికార్లు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల చలక వద్ద ఉప్పచలక నుంచి మూల గూడెం వరకు సుమారు నాలుగు మూల మలుపులు ఉన్నాయి. ఈ రోడ్డు పై పలు గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం జిల్లా కేంద్రం ఖమ్మంకు పోతుంటారు. ఈ రోడ్డు పై కూడా ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికార్లు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



గుబ్బగుర్తి వద్ద ఉన్న మూలమలుపు



గద్దలగూడెం వద్ద ఏరు సమీపంలో..

బోర్డులు ఏర్పాటు చేయాలి..



మూల మలుపుల దగ్గర ఎటువంటి ప్రమాద సూచికల బోర్డులు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు మరిన్ని జరుగుతున్నాయి. వర్షాకాలం నిత్యం ప్రమాదాలు చూడాల్సి వస్తుంది. అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగ కుండా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– ముత్యాల భాస్కర్, తీగలబంజర

జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక



విద్యార్థిని సత్కరిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలోని వేమిరెడ్డి వెంకటరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ దుర్గాభవాని గత నెలలో మెదక్ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖో-ఖో పోటీల్లో తెలంగాణ తరఫున దుర్గాభవాని పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సర్పంచ్ శీలం జయలక్ష్మి, జెడ్పీటీసీ శీలం కవిత, ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, పాఠశాల హెచ్‌ఎం బి.సుభద్రాదేవి, పీఈటీ గూడూరు వెంకటసత్యనారాయణరెడ్డి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యరమల పూర్ణచంద్రారెడ్డి, వెంకటనర్సమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్

మధిరరూరల్: మధిర పట్టణంలోని హరిజనవాడ హైస్కూల్, గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు పృథ్వీరాజ్ నాయక్ మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఆరోగ్య రక్షణపై హెల్త్ సూపర్ వైజర్ లంక కొండయ్య గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కాజా అరుణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ, వైద్య సిబ్బంది సుబ్బులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ: అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి ఎమ్మెల్యేగా మట్టా రాగమయి గెలిస్తే 101 కొబ్బరికాయలు కొడతామని కోరుకున్న మొక్కును కాంగ్రెస్ నాయకులు తీర్చుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ ఆధ్వర్యంలో ఏన్కూరు మండలం గార్లొడ్డు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ధ్వజ స్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో తల్లాడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కటికి కిరణ్ కుమార్, తాటి నరసింహారావు, షేక్ జమాల్ పాల్గొన్నారు.

జమలాపురానికి పాదయాత్ర

కొణిజర్ల: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు.. పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయం సాధించి రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా ప్రమాణం చేసినందుకు, వైరా ఎమ్మెల్యేగా రాందాస్‌నాయక్ విజయం సాధించడంపై కాంగ్రెస్ నాయకులు సోమవారం జమలాపురం ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. మండలంలోని పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దమునగాల నుంచి ఎర్రుపాలెం మండలం జమలాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయానికి పాదయాత్ర నిర్వహించారు.

రామచందర్‌రావుకు నివాళి

వైరా: వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యండ్రపూడి రామచందర్‌రావు సోమవారం మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్.. రామచందర్‌రావు భౌతిక కాయాన్ని సందర్శించి కాంగ్రెస్ జెండా కప్పి నివాళులు అర్పించారు. రామచందర్‌రావు మృతికి తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. నివాళులర్పించిన వారిలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు హుస్సేన్, నాయకులు దానియేలు, నాగేశ్వరరావు, వెంకటకృష్ణ, గంగరాజు, శబరీనాద్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మధిరరూరల్: ఈ నెల 12న మధిర 132 కేవీ సబ్ స్టేషన్ విద్యుత్ లైన్స్ మరమ్మతుల కారణంగా మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం.అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని నాగిలిగొండ గ్రామంలో షేక్ లాల్‌బీ, ఏపూరి సుశీల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెరో రూ.44 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం గ్రామసర్పంచ్ చాట్ల సురేష్ బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చాట్ల భగవాన్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న మేనేజర్ వీరభద్రం, సొసైటీ చైర్మన్ సాంబశివరావు

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లిగోపవరం గ్రామానికి చెందిన మందడపు అప్పారావు ఇటీవల మృతి చెందాడు. ఆయనకు అయ్యవారిగూడెం సొసైటీ కార్యాలయం బీమా ఉండడంతో.. రూ.50 వేల నగదు మంజూరయ్యాయి. ఈ నగదును సోమవారం ఎర్రుపాలెంలోని డీసీసీబీ బ్యాంక్ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు, బ్యాంకు మేనేజర్ మగినం వీరభద్రం మృతుడి భార్య కృష్ణవేణి అందించారు. అదే విధంగా బనిగండ్లపాడు గ్రామానికి చెందిన కూరపాటి భాస్కరరావు ఇటీవల మృతి చెందగా.. ఆయనకు పెద్దగోపవరం సొసైటీ నుంచి మంజూరైన రూ.50 వేల నగదును సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డితో కలిసి బ్యాంక్ మేనేజర్ అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ, సూపర్ వైజర్ మహేష్, సీఈఓలు వీరారెడ్డి, ఎస్.మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళి, రమణ రెడ్డి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అభిషేక పూజలు



శివుడి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్నఅర్చకుడు సతీష్ శర్మ

తల్లాడ: తల్లాడలో సోమవారం రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అభిషేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు కంచెల సతీష శర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జామున 5 గంటల నుంచే అభిషేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శివుడికి నవరసాలు, పంచామృతాలతో అభిషేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉన్న అతి పెద్ద శివుడి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తల్లాడ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లి: హైద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను సోమవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలుసుకొని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ గాయపడటం బాధాకరమని, భగవంతుని దయవల్ల త్వరగా కోలుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులపై సమావేశం

ముదిగొండ: ముదిగొండ మండలపరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులపై సీడీపీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో సోమవారం సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీటి వంటి సౌకర్యాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ సూర్యనారాయణ, సీడీపీఓ కమల ప్రియ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్యారాణి, రాజకుమారి, సావిత్రి పాల్గొన్నారు.

నాగులవంచలో వనసమారాధన

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో శాలివాహన (కుమ్మరి) సంఘం ఆధ్వర్యంలో సోమవారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక మాసపూజలు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర కార్యదర్శి దరిపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నర్సింహారావు, ఖమ్మం నగర అధ్యక్షుడు నర్సింహారావు, మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కారేపల్లి: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తహసీల్దార్ సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

శివాలయంలో మంత్రి పొంగులేటి పూజలు



కల్లూరు: శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కల్లూరు/కల్లూరురూరల్: కార్తీకమాసం సోమవారాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కల్లూరు ఎన్నెస్పీ క్రాస్ వద్ద ఉన్న శ్రీ వీరభద్రస్వామివారి(శివాలయం) దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట భార్య మాధురి, సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడలో కనకదుర్గమ్మ దర్శనానికి వారు బయలుదేరారు. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటన అనంతరం ఆదివారం రాత్రి స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం వచ్చిన మంత్రి పొంగులేటికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం తన తండ్రి రాఘవరెడ్డి సమాధి వద్ద ఆయన నివాళులర్పించారు. నాయకులు పిడమర్తి రవి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కాటేపల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నీలాద్రిలో ఎమ్మెల్యే రాగమయి..

పెనుబల్లి: మండలంలోని నీలాద్రీశ్వరాలయంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమాయి, దయనంద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి కార్తీక సోమవారం కావడంతో ఆలయ సిబ్బంది నీలాద్రీశ్వరిని కల్యాణం నిర్వహించగా ఎమ్మెల్యే దంపతులు స్వామి కల్యాణ ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమరాజు సీతారాజరావు, నున్న రామకృష్ణ, కీసర శ్రీనివాసరెడ్డి, బోర్ర కోటేశ్వరరావు, ఎస్‌కె ఖరీముల్ల, పంది వెంకటేశ్వరరావు, గూడురు మాధవరెడ్డి, దొంతు మాధవరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, పోతురాజు కిషోరు, వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తులు..

కొణిజర్ల: మండలంలోని పలు శివాలయాల్లో సోమవారం కార్తీక మాసం పురస్కరించుకొని భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామనే దేవాలయాల్లో దీపాలు వెలిగించి భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొణిజర్ల, పల్లిపాడు, తనికెళ్ల, రెడ్డిగూడెం శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కార్మికుల కృషితోనే పరిశుభ్రత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: పారిశుద్ధ్య కార్మికుల కృషితోనే పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం ఆమె నివాసంలోని క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి మున్సిపల్ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాల్టీగా సత్తుపల్లిని తీర్చిదిద్దటంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. కార్మికుల కష్టానికి అభినందనలు తెలి పారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎన్నో ఏళ్లుగా చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నామని, కుటుంబాలు గడవలేని పరిస్థితి ఉందన్నారు. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను తీసివేసి పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అదనపు పనిభారంతో సతమతమౌతున్నామని, పని వేళలకంటే ఎక్కువ పనిగంటలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల్లో సీనియర్లకంటే జూనియర్లకు ఎక్కువ వేతనాలిస్తూ తేడాలు చూపిస్తున్నారని వాపోయారు. గత పాలకవర్గాల్లో తెల్లవారుజామున 5 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి డ్యూటీలకు వేళ్లవాళ్లమని, ఇప్పుడు తెల్లవారుజామున 4 గంటలకే వచ్చి చీకట్లో డ్రెయినేజీలు, రోడ్లు శుభ్రం చేయటం భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఆమె సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఎస్టీ బాలికల హాస్టల్‌ను సందర్శించిన..

అనంతరం ఎస్టీ ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే రాగమయి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో వసతులపై ఆరాతీశారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలీ, ఎస్‌కె నాగుల్‌మీరా, దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతిలతో పాటు చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్‌పాషా, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, కె.మారేశ్వరరావు, నాగేశ్వరరావు, జీవన్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రాణంపోయినా పోడు భూములు వదలం..



గిరిజనులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

సత్తుపల్లిరూరల్: మా ప్రాణాలు పోయినా మా పోడు భూములు వదిలేది లేదని.. 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న మా భూములను ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా ఆక్రమించి మాపై కేసులు పెట్టారని సీపీఐ మండల నాయకుడు తాటి వీరభద్రం ఆరోపించారు. సత్తుపల్లి మండలం చెరుకుపల్లిలో పోడు భూముల్లో శుభ్రం చేసుకుంటున్న గిరిజనులను ఫారెస్ట్ అధికారులు సోమవారం అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఇంతకు ముందే ఈ భూముల విషయంలో అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపారని, గతంలో మాకు తీరని అన్యాయం జరిగిందని.. మా భూముల్లో మేమే విత్తనాలు వేసుకునేందుకు ప్రయత్నం చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని బెదిరింపులు చేసినా భూమిని వదిలేది లేదని సీపీఐ మండల నాయకులు తాటి వీరభద్రం అన్నారు. ఈ విషయాన్ని మంగళవారం సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్తామని, ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం ఆపకపోతే ఎంతటి పోరాటానికైన సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడ్డం కృష్ణయ్య, గడ్డం రాజులు, తాటి రాజులు, తాటి వీరభద్రం, తాటి కుమారి, భద్రమ్మ, వడే రాజు, తిరుపతమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాలధారుల ఇరుముడి



తనికెళ్లలో కన్నె స్వామికి ఇరుముడి కడుతున్న గురుస్వామి

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో సోమవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన 270 మంది అయ్యప్ప మాలధారణ చేసి గత 40 రోజుల నుంచి నిష్ఠగా స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం సోమవారం ఇరుముడి కట్టకుని శబరిమలైకు బయ లుదేరారు. ఈ సందర్భంగా గురుస్వాములు ఇరుముళ్లు కట్టు వేడుక నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు వారి బంధువులతో శివాలయం కిట కిటలాడింది. హాజరైన భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. అనంతరం ఇరుముళ్లతో స్వాములంతా ఊరేగింపు నిర్వహించి ఖమ్మం వెళ్లారు.

పరిశుభ్రతకు సహకరించండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: పట్టణ పరిశుభ్రతకు ప్రజలందరు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ కోరారు. చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో కమిషనర్ కె.సుజాత, కౌన్సిలర్లు ఎస్‌కె చాంద్‌పాషా, ప్రవీణ్, వీరపనేని రాధిక, మేకల భవాని, నడ్డి జమలమ్మ, నాగుల్ మీరా, అద్దంకి అనీల్, సలీమాఖాతూన్, మహ్మద్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

కల్లూరురూరల్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఏ పథకానికైనా రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటున్నారని, వెంటనే రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ మంజూరు చేయాలని ఎంపీటీసీ కొండూరు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీపీ బీరవల్లి రఘు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల లాంటి పథకాలు పేదలకు అందాలంటే రేషన్ కార్డులు తప్పనిసరి కావడంతో కార్డులు మంజూరు చేయాలన్నారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, ఆగిపోయిన అభివృద్ధి పనులు కొనసాగించాలని అధికారులను పలువురు పలువురు అడిగారు. ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొత్త ప్రభుత్వానికి, సత్తుపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ మట్టా రాగమయికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవికుమార్, తహసీల్దార్ సాంబశివుడు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.